

# ఏరు పొంగింది

## విరించి

ఆ రెండు ఊళ్ళ మధ్య గొడవలు ఎప్పటినుండో రగులుతున్నాయి. పాతపగలు ఆవేశానికి ఆజ్యంపోశాయి. కర్రలు, కొడవళ్ళు పైకిలేచాయి. ఎవరి గ్రామాన్ని వారు కాపాడుకోవాలన్న ఆవేశం వారిని మూర్ఖుల్ని చేసింది.

చుట్టముట్టిస్తూ, ఆకాశంలోకి చూశాడు స్వామి నాయుడు.

మబ్బులు ఆకాశాన్నంతా ఆక్రమించుకొన్నాయి. సూరీడుకి కాస్త జాగా కూడా యివ్వలేదు.

నిన్న మధ్యాహ్నం నుంచి ఈ మబ్బులిలా స్వైర విహారం చేస్తునే వున్నాయి. అయినా వాటికి అలుపు ఆయాసం వున్నట్లు లేదు. కుండపోతగా వర్షం కురుస్తూనే వున్నది.

ఈ ఏడు వర్షాలు విపరీతంగా వున్నాయి. అనుకొన్నాడు స్వామి నాయుడు.

ఇలాగైతే పంట దెబ్బతినటం ఖాయం! ఆ మాట నిన్నటి రాత్రినుంచి అనుకొంటూనే వున్నాడు. నోటి దగ్గరకొచ్చిన కూడు నేలపాలయ్యేనంతబాధ.

పాడు వాన బంగారం లాంటి పైరుని పొట్టన పెట్టుకుంటుంది. చుట్టనోట్లోంచి తీసి, తుపుక్కున వుమ్మేసాడు స్వామి నాయుడు.

నేలంతా బురద: కాలువేస్తే జర్రున జారిపోయేటట్లు వుంది.

అసలే వూళ్ళో వీధి లైట్లు లేవు. ఉన్నా వెలిగే పరిస్థితిలో లేవవి.

కత్తులు ఝుళిపిస్తున్నట్లు మెరుపులు మెరుస్తున్నాయి. చలిగాలి "ఈదర" మని వీస్తూంది.

జల్లు మొహం మీద కొట్టటంతో అరుగుమీద నుంచి లోపలి గదిలో కెళ్ళాడు స్వామినాయుడు. కోడిగ్రుడ్డు చిమ్నీలోని దీపం ఏక్షణాన్నైనా ఆరి పోవటానికి సిద్ధంగా వుంది.

ఇంట్లోని అందరూ ఆ గదిలోనే గుమికూడారు. అప్పుడప్పుడూ పైనుండి వాన చినుకులు "టప్ టప్" మని పడు తున్నాయి.

అవి పడుతున్నప్పుడల్లా భయంతో బిగుసుకుపోతున్నారు ఆ యింట్లోవాళ్లు.

"మొన్నఇల్లునేయించి వుంటేబావుం డేది" మౌనంగా వుండలేక అన్నాడు స్వామినాయుడి పెద్ద కొడుకురత్తయ్య.

"సర్లే అయ్యిందేదో అయ్యిందిగాని కొద్దిగా రేడియో పెట్టు. వాన ఎప్పుడు తగ్గుతుందో ఏంటో? స్వామి నాయుడు కొడుకుతో చెప్పాడు.

రేడియో పెట్టేసరికి. "బర్ర్ మంటూ శబ్దం!

ఆ "బర్ బర్"ల మధ్యే వార్తలు విన్నారందరూ.

ఇంకా తుఫాన్ 36 గంటలున్నట్లు. గోదావరి. కృష్ణా నదులుపొంగేప్రమాద ముందని. అక్కడెక్కడో వూళ్ళు మునిగిపోయాయనిఎనౌన్సర్ చెప్పాడు

"ముప్పయ్యారు గంటలే" గుండెల మీద చెయ్యేసుకుంది రత్తయ్య భార్య లక్ష్మి.

"ఒరే బావా" బయట్నుండి పిల్చా రెవరో. దీపం పట్టుకొని. బయటి కొచ్చాడు స్వామి నాయుడు.

గొడుగేసుకుని వచ్చి. వున్నాడు రామిరెడ్డి.

"ఏరా బావా. ఏంటీ వేళొచ్చావ్? మీ కొంపలోకి నీరొచ్చేసిందా ఏంటి" ఆతృతగా అడిగాడు స్వామినాయుడు.

ప్రస్తుతానికేమీ మునగలేదు కాని. కాసేపటికో కాసేపటికో అన్నట్లుంది అరుగు పైకొస్తూ. అన్నాడు రామిరెడ్డి.

"వార్తలేమన్నా తెలిసాయా?"

"ఆ" స్వామి నాయుడి మాటలకి నిట్టూర్చి. చెప్పాడు రామిరెడ్డి "పోతు రాజు గుళ్ళోకి నీళ్ళు వచ్చేసాయట. ఒడి గుడంలో నీళ్ళమయం . నీళ్ళల్లో తేల్తున్నట్లుగా వుంది గుడి.హైలుపట్టాలు సుబ్బరంగా మునిగిపోయాయంట"

ఆపుర్దా హెచ్చింది స్వామి నాయు డికి.

"ఏరెలా వుందో....?" అర్థోక్తిగా ఆపేసాడు.

"ఏరు పొంగిందట. మరీఎక్కువై పోతుందని ఇందాకే లచ్చయ్య అన్నాడు"

"ఏరు పొంగిందంటే. మనూరు ...." గొంతు వణికింది స్వామినాయు డికి.

"ఏందయ్యా నాయుడు? ఉస్సురో మంటూ కూచుంటే యింతే! మన తంటాలు మనం పడ్డాము. ఆ పైన పోలే రమ్మ తల్లివుంది."

"ఏం చేద్దామన్నా?"

"ఊరిడిచి వె...."

మాట పూర్తికాక ముందే కసిరాడు స్వామి నాయుడు. "మా గొప్పోడివిలే ఉన్న పళంగా పూరు ఖాళీ చేసి వెళ్ళి పోతే మన గొడ్డూ గోదా. మనకున్న కాస్తంత ఆధారం యిక్కడే వున్న దాయె.

"ఏరుకి గండేస్తే సరి. మనకీగండం గట్టెక్కుతుంది!" కురుస్తున్న వర్షంకేసి చూస్తూ. సలహా యిచ్చాడు.

"గండా?!" ఒక్కక్షణం తటపటా యించాడు రామిరెడ్డి. వందలాది సందే హాలు అతని మెదడులోకి ఒక్కుమ్మ డిగా జొరబడ్డాయి.

మరో మాట మాట్లాడకు. అయినా వూళ్ళోని పెద్దోళ్ళేమంటారో కను క్కుందాము. ఆ తర్వాత యేదో ఓటి చేయొచ్చు.

సరే. పోదాంపా ముందుకి కది లాడు రామిరెడ్డి.

చేతిలోకి కర్ర తీసుకుని. రామి రెడ్డితో నడవబోతుంటే అడిగాడు రత్తయ్య స్వామి నాయుడ్ని. "నేనూ రానా?"

పెద్దోళ్ళం మేం ఏడితాముగా నువ్వింటికాడే కూకో. ఆడోళ్ళు. పిల్లలున్నారు. కసురు కుంటున్నట్లు చెప్పాడు నాయుడు.

మోకాలిదాకా వచ్చేస్తున్నాయి నీళ్ళు అడుగు తీసి. అడుగేయటం బ్రహ్మ ప్రళయమైపోతుంది.

తిన్నగా రాఘవయ్య దగ్గరకెళ్ళారు. అప్పటికే చాలామంది వూరి పెద్దలు వచ్చి వున్నారు.

కాసేపు బాటు అందరూ ఒకరి మొహాలు యింకొకరు చూసుకొంటూ. మౌనంగా వుండిపోయారు.

ఆ తర్వాత ఓ అర్ధగంట తీవ్రంగా ఆలోచించి. ఏరుకి గండికొట్టడానికి నిశ్చయించుకున్నారు.

లాంతర్ల కాంతిలో దారి చూసు కొంటూ. ఏరు దగ్గరకి నడిచారు.


అంతా నల్లటి చీకటి.ఏమీ కన్పించ నీయని అంధకారం.... గాలి హోరు మని వీస్తుంది.

ఆగాలి తాకిడికి అటూ యిటూ పూగిసలాడి పోతున్న కొబ్బరి చెట్ల సవ్వడి ఎక్కడో దూరం నుండి విన్పి స్తుంది.

ఆకాశం అప్పుడప్పుడూ ఉరుము తోంది. మెరుస్తోంది.

వర్షపు ధారలు వాళ్ళందర్ని తడిపి. ముద్దల్ని చేసాయి.

ఏరు ఉధృతంగా పొంగింది. మీది మీది కొచ్చేస్తుంది.



ఏ క్షణాన ఊరు మీద పడుతుందో అన్నట్లుగా వుంది ఏరు.

"జాగ్రత్తరోరేయ్" అరిచాడు రామిరెడ్డి గండి వెయ్యటానికి వెళ్తున్న వాళ్ళతో.

వాళ్ళలా వెళ్తున్నారో లేదో, దూరం నుండి లాంతర్ల వెలుగు కన్పించింది. పెద్ద పెద్ద కేకలు వినబడ్డాయి.

"వీళ్ళ వరస చూస్తుంటే, ఎంకన్న పాలెం వాళ్ళల్లా వుందే" ఆ వెలుగుకేసే చూస్తూ, అన్నాడు రాఘవయ్య.

పెద్ద తంటా వచ్చిపడిందే! లక్ష్మీ కొడుకులు, గండివెయ్యనివ్వరు చిరాకు పడ్డాడు స్వామినాయుడు.

అవును మరి. మనం గండేస్తే, ఏరు వాళ్లూరుని ముంచేస్తుందాయె అన్నాడు రామిరెడ్డి.

ఇంతలో వాళ్ళని సమీపించారు వెంకన్న పాలెం వాళ్లు. వాళ్ళ భయం వాళ్ళది.

వారికి నాయకత్వం వహిస్తున్నారు చంద్రయ్య, సత్యనారాయణ.

'నా కొడకల్లారా, గండేసారో మీ తలకాయలు లేచిపోతాయి" వేగంగా వూపిరిపీలుస్తూ బెదిరించాడు చంద్రయ్య

ఒక్కక్షణం ఇరకాటంలో పడ్డారు. స్వామి నాయుడు, వాళ్ళు.

ఇప్పుడు గండెయ్యకపోతే, ఈ రాత్రికి ఏరు తమ వూరుని మింగేస్తుంది. అందరూ చస్తారు. ఆ చచ్చేదేదో యిక్కడే చచ్చి వూరిని వూళ్లోని తమ ఆస్థుల్ని, కుటుంబాల్ని కాయడం మంచిదన్న అభిప్రాయానికొచ్చేసారు వారు.

'అబ్బా, అంత దమ్మున్న మగోళ్ళు బయల్దేరారే రేయ్, గండెయ్యండ్రా, ఏ నాకొడుకు అడ్డమొస్తాడో చూస్తాను' కర్ర పైకెత్తుతూ, అన్నాడు స్వామి నాయుడు.

రెచ్చిపోయాడు సత్యనారాయణ.

ఆ రెండు వూళ్ళ మధ్య గొడవలు ఎప్పటి నుండో రగులుతున్నాయి.

అవన్నీ గుర్తుకొచ్చాయి ఇరుపక్షాలకి. పాత పగలు ఆవేశాగ్నికి ఆజ్యం పోసాయి. కర్రలు, కొడవళ్ళు పైకి లేచాయి. పైనుండి కురుస్తున్న వానని ఏ మాత్రం ఖాతరు చెయ్యలేదు ఆ ఇరువర్గాలు.

ఎవరి గ్రామాన్ని వారు కాపాడుకోవాలన్న తలంపు వారిని మూర్ఖుల్ని చేసింది.

లాంతర్లు పగిలాయి.

గావుకేకలు పెడుతున్నారు. ఆఖరి అరుపులు అరుస్తున్నారు బూతులు తిట్టుకుంటున్నారు.

ఆకాశం నిండా చీకటి.... క్రింద నేలమీద నీళ్లూ!

ఏరు ఉధృతం కాజొచ్చింది. గాలి వింత చప్పుడు చేస్తుంది.

ఇక్కడ జరుగుతున్న గొడవ వూళ్లోకి పాకింది.

ఆడవాళ్లు బెంబేలెత్తిపోయారు. మంగళ సూత్రాలను కళ్ళకద్దుకొని, పోలేరమ్మ తల్లికి మొక్కుకున్నారు తమ మొగుళ్ళని కాపాడమని.

ఇళ్ళ దగ్గరున్న మగాళ్ళ నడుము బిగించి, కత్తులు, కటార్లతో యుద్ధరంగానికి పరుగెత్తారు.

ప్రాణభయం కలిగించిన ఆవేశం వారందర్నీ ఆలోచనా రహితుల్నిచేసింది

అక్కడి రక్తపాతం సహించలేక కాబోలు, ఏరు గట్లు తెంచుకొని, వూళ్లోకి వురికింది.

"ఏరు వూళ్లోకి వస్తుందొరేయ్" అరుస్తూ, పరుగు తీయబోయారు.

కాని సుడులు తిరుగుతున్న నీళ్ల వాళ్ళని తమలోకి లాక్కున్నాయి.

మరుసటి రోజు వుదయం ....

వాళ్ళ రక్తంతో కలిసి, ఏట్లోని బురద నీళ్ల ప్రవహిస్తున్నాయి.

ఇనుమడించిన వుత్సాహంతో రెక్కలు టపటపా కొట్టుకుంటూ, రాబందులు ఆకాశంలో గిరికీలు కొడున్నాయి.

## నెమ్మదస్తుడు

"మీరు చాలా నెమ్మదస్తులు" అంది లలిత భర్తతో.

"మా నాన్నకూడా నెమ్మదస్తుడే" అన్నాడు ప్రభాకరరావు.

"ఆ సంగతి మా అమ్మగారు చెప్పారు. మీ నాన్నగారు నెమ్మదస్తులు కాకుంటే మీరు మూడేళ్ళ ముందుగానే పుట్టి ఉండేవాళ్ళట" అంది లలిత.

-బి.కె. ప్రసాద్ (హైదరాబాదు)

[ ౧ వ పేజీ నుండి ]

జీవితానికి దూరంగా తొలగిపోయాం. సమస్యలు రకరకాలుగా మారిపోయాయి. మీ సమస్యలకు మీరే పరిష్కారం వెదుక్కోవాలి" అన్నాడాయన దీర్ఘంగా ఆలోచిస్తూ.

## ఆఖరు నాటకం

"నా నాటకాలన్నింటికీ నేనే దర్శకుణ్ణి. ఆనాడు నేనెన్నో ఘన విజయాలను చవిచూశాను. ప్రజల మనిషిగా ప్రజా రచయితగా గుర్తించబడ్డాను. ఇవాల్టి నాటకరంగం నన్ను తీవ్రంగా ఆలోచింపచేస్తోంది. అందుకు నాఆఖరు నాటకంగా 'ఆఖరు నాటకం' వ్రాయడం మొదలెట్టాను. ఈ నాటకం రచయితల్లో కళాకారుల్లో ఒక నూత్న చైతన్యానికి ఒక కొత్త ఆలోచనా విధానాన్ని కల్గించాలని, కల్గించగలదని విశ్వసిస్తున్నాను. అందుకోసమే నిర్విరామంగా కృషి చేస్తున్నాను" అన్నాడాయన తన కార్యక్రమాలను వివరిస్తూ.

## ఆచార్య ఆత్రేయ

ప్రముఖ నాటకరచయితగా అంతకు మించి నిపుణుడైన సినిమారచయితగా ఎవరెస్ట్ శిఖరంలా నిలిచిన ఆత్రేయ మొదటి దశలో జీవితంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. పాండీబజార్ అనుభవాలన్నీ ఆయనకూ వున్నాయి. అయితే మల్లాది రామకృష్ణశాస్త్రి, శ్రీశ్రీ సముద్రాలవంటి పెద్దల శుభాశీస్సులు ఆయనకు వున్నాయి. స్వయంకృషితో ఇది "సినిమాడైలాగ్" అనీ, ఇది "ఆత్రేయ డైలాగ్" అని ఒక ప్రత్యేకమైన ముద్ర వేసిన అసమాన రచయిత ఆచార్య ఆత్రేయ. దృశ్యానికి తగిన సంభాషణలు, సంఘటనకు తగిన పాటలు ఆత్రేయే వ్రాయాలి. ఆయన వ్రాస్తున్న ఆఖరు నాటకం ఒక నూతన దృక్పథాన్ని తెలుగు నాటక రంగానికి ఇవ్వగలదనడంలో సందేహం లేదు.

— ఫోటో: సాయిరమేష్